క్లుప్తంగా

12న మండల పరిషత్ సమావేశం

చల్లపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సీఎం సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన



కోనేరుసెంటర్: బందరు పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభాస్థలి ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిట్టు అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. గ్యాలరీలను, పైలాన్‌ను పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లు వేగవంతంగా జరపాలని తెలిపారు. కార్యక్రమంలో బందరు నియోజకవర్గం కన్వీనర్లు శీలం మారుతీరావు, చిటికెన నాగేశ్వరరావు, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, గాజుల భగవాన్ పాల్గొన్నారు.

పింఛనుదారుల ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 34వ డివిజన్‌కు చెందిన పింఛను లబ్ధిదారు ఫాతిమా బేగం ఇటీవల మృతి చెందారు. తోటి పింఛనుదారులు ప్రతి ఒక్కరూ రూ.100 సేకరించి వచ్చిన రూ.26,800ల నగదును బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి బడే భానుతేజతో కలిసి నగదును పింఛనుదారులు ఫాతిమా బేగం కుటుంబ సభ్యులకు అందించారు.

వృద్ధులకు కంటి, దంత పరీక్షలు



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఉచిత నేత్ర, దంత వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రి గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో 25 మందికి పరీక్షలు నిర్వహించి ఇద్దరికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ప్రతి నెల రెండో బుధవారం ఈ వైద్యశిబిరం సంఘ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వైద్యురాలు రమ్య 20 మంది వృద్ధులకు దంత పరీక్షలు నిర్వహించి పేస్ట్‌లు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవరావు, కోశాధికారి శంకరరావు, జాయింట్ సెక్రటరీ బీకె దుర్గారావు పాల్గొన్నారు.

పైడమ్మ కాలనీలో విద్యుత్ సౌకర్యానికి చర్యలు



పెడన: పైడమ్మ కాలనీలో విద్యుత్ సౌకర్యానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చొరవతో చర్యలు చేపట్టారు. ఇటీవల కాలనీ మహిళలు మంత్రిని కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పురపాలక సంఘం నుంచి రూ.10 లక్షలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను మంత్రి ఆదేశాలు ఇవ్వడంతో బుధవారం విద్యుత్ స్తంభాలు కాలనీకి చేరుకున్నాయి. కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, పిచ్చిక సతీష్, మెట్ల గోపీలతో పాటు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి పనులను పర్యవేక్షించారు.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు హౌస్ రెంట్ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ)ను 16 శాతం పెంపు చేయటం పట్ల ఏపీ ఎన్జీవో సంఘ నాయకుడు, ఏపీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఉల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే సరెండర్ లీవ్‌కు సంబంధించిన రూ.5 వేల కోట్లను ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మోపిదేవి మోడల్ పీఎస్ ప్రారంభానికి సిద్ధం

రూ.1.40 కోట్లతో అత్యాధునిక భవన నిర్మాణం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన పోలీస్ స్టేషన్

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనార్థం పలువురు వీవీపీలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు నిత్యం మోపిదేవికి తరలివస్తుంటారు. భక్తుల రద్దీ, వీవీపీలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ స్టేషన్ ఆవశ్యకతను నాడు వైఎస్సార్ ప్రభుత్వం గుర్తించింది. మండల కేంద్రం మోపిదేవికి 13 పంచాయతీల్లో ప్రజలు వారి, వారి సమస్యలపై తరచూ మండల కేంద్రానికి వస్తుంటారు. రెండు జిల్లాలు గుంటూరు, కృష్ణాజిల్లాల నది ఒడ్డున మోపిదేవి ఉండటం వల్ల రక్షణపై జాగ్రత్తలూ అవసరం. అందులో బాగంగా మోపిదేవిలో ఓపీ పోలీస్ స్టేషన్ మార్చి 27, 2012న అప్పటి డీజీపీ దినేష్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు చొరవతో ప్రజలకు మరింత రక్షణ, సౌకర్యార్థం అత్యాధునిక మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని 13 పంచాయతీల్లో మూడు పంచాయతీలు చల్లపల్లి సర్కిల్‌లోనూ, మిగిలిన 10 పంచాయతీలు అవనిగడ్డ సర్కిల్‌లోనూ ఉండేవి.

ఇప్పుడు మండలంలో మొత్తం పంచాయతీలను ఒకే చల్లపల్లి సర్కిల్ పరిధిలోకి తీసుకువస్తూ హోం శాఖ నిధులు రూ.1.40 కోట్లతో ఆధునిక సదుపాయాలతో పోలీస్ స్టేషన్ నిర్మించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలతో పాటు అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తూ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కంట్రోల్ చేస్తూ స్టేషన్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూము కూడా ఇందులో ఏర్పాటు చేశారు. దిశా పెట్రోలింగ్‌కు వాహనంతో పాటు స్టేషన్ కింద పోలీస్ వాహనాలు సిద్ధం చేస్తున్నారు. భవనం రెండు అంతస్థులలో నిర్మించి కింద భాగంలో పూర్తిగా స్టేషన్ సిబ్బంది, ఖైదీల గదులు ఉంటాయి. పై భాగాన మెన్, మహిళా సిబ్బందికి వేరువేరుగా విశ్రాంతి వసతి గదులు నిర్మించారు. ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలతో పాటు నలుగురు హెడ్ కానిస్టేబుల్స్, 20 మంది కానిస్టేబుల్స్ ఉంటారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ.. అతి త్వరలోనే పోలీస్ స్టేషన్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

త్వరలో స్టేషన్ ప్రారంభం



జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు అతి త్వరలోనే మండల కేంద్రం మోపిదేవిలో మోడల్ పోలీస్ స్టేషన్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్టేషన్ ప్రారంభించిన తరువాత గెజిట్ నోటిఫికేషన్, సిబ్బందిని కేటాయిస్తాం.

– మురళీధర్, అవనిగడ్డ డీఎస్పీ

దేశానికే ఆదర్శంగా ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెదగౌడపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పర్రచివర(నాగాయలంక): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిస్తున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పర్రచివర సచివాలయ పరిధిలోని పెదగౌడపాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి నేర్చుకునే స్థాయిలో దేశంలోని పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని చెప్పారు.

పెరిగిన ప్రజాదరణ..

గ్రామంలోని 300 గృహాలకు వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమం వివరాలను లబ్ధిదారులుకు చదివి వినిపించి సంబంధిత పత్రాలను ఎమ్మెల్యే అందించారు. ప్రణాళికలో ప్రకటించిన నవరత్నాలతో చేపట్టిన సంక్షేమ పథకాల అమలు, సచివాలయ వ్యవస్థ రూపకల్పనతో గ్రామీణ ప్రాంతాలకు, పేద బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమున్నత స్థాయి కల్పించడంతో ప్రజాదరణ విపరీతంగా పెరిగిందన్నారు. గ్రామ పాలనా వ్యవస్థను గ్రామస్తులకు చేరువ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేకూరుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అండగా నిలవాలని ఎమ్మెల్యే గ్రామస్తులను కోరారు. జగనన్న బీసీలు, పేదలకు పెద్దపీట వేయడాన్ని కూడా చంద్రబాబు జీర్ణించుకోలేని స్థితిలో తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ(చిన్నారి), బుడిపల్లి ఆదిశేషు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరిశె యేసయ్య, వీఆర్వో కె.వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యదర్శులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



దాసాంజనేయుని విగ్రహం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

నాగాయలంక: గ్రామంలోని పార్వతీసమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నూతన ఆలయ గోపుర శిఖర కలశాలు, శ్రీదాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠోత్సవం కనులపండువగా జరిగింది. శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ, గురుదేవులు కె.భానుప్రసాద్ దివ్యమంగళాశీస్సులతో తొలుత బ్రహ్మశ్రీ గుండేపూడి నాగరాజశేఖరశర్మ బృందం బ్రహ్మత్వంలో వేడుకలు నిర్వహించారు. రుత్విక్కుల వేద మంత్రోచ్ఛరణలతో తొలుత తొమ్మిది జంటల దీక్షా దంపతులు పీటలపై కూర్చోగా మండప దేవతా పూజలు, నిత్యహోమాలు, గర్తన్యాసం, బీజ, ధాతు, రత్నన్యాసములు జరిగాయి. ఉదయం 9 గంటల 26 నిమిషాలకు యంత్రస్థాపన, కుంభాషేకం చేపట్టాయి. పూర్ణాహుతి, కళాన్యాసం, నేత్రోన్మీలనం, ధేనుదర్శనంతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ముగిశాయి. నాలుగు వేల మందికి అన్నసంతర్పణ జరిపారు. శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, శ్రీవాసవీ యూత్ సభ్యులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సింహాద్రి విశేష పూజలు

శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం జరిగిన ప్రతిష్ఠోత్సవానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పాల్గొన్నారు. తొలుత ఆయన శ్రీదాసాంజనేయ స్వామిని, శిఖర కలశ ప్రతిష్ఠ జరిగిన కన్యకాపరమేశ్వరి, పార్వతీదేవి, శ్రీనగరేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు ఎమ్మెల్యేకు శేషవస్త్రాలతో సత్కరించారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి, నాయకులు భోగాది శేషగిరిరావు, మద్ది చిన్నారి, ఆకుతోట సుధీర్, చిట్టా బాలపాపారావు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు విద్యార్థులకు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు బుధవారం పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కథలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక పఠనం, డాన్స్, తెలుగు పద్యాలు, పాటలు పాడటం, నేర్పించడం వంటి వాటిని రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, ఉపాధ్యాయులు యు.తిరుమలరావు, ఎం.శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని లైబ్రేరియన్ జె.ప్రభుదాస్ పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



అవగాహన కల్పిస్తున్న సెక్షన్ ఆఫీసర్ వలీ

కోడూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరూ కృషి చేయడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండాలని అవనిగడ్డ అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ వలి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడంతో పాటు క్యారీబ్యాగ్‌లను వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణం విషతుల్యంగా మారడం వల్ల మానవ జాతికి, పక్షులకు కలిగే నష్టాలను తెలిపారు. హంసలదీవి అభయారణ్యంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఫారెస్ట్ ఆఫీసర్ శివకుమార్, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

పామర్రు: ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో 2022–23 ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను బుధవారం అందజేశారు. కళాపీఠం అధ్యక్ష ఉపాధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, కోటి పాండురంగారావు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుని మరింత ప్రోత్సహించేందుకు 10 మంది విద్యార్థులకు ఈ పురస్కారాలను ఇచ్చామన్నారు. పామర్రు పమిడిముక్కల ఎంఈవోలు పి.విజయలక్ష్మి, శ్రీనివాసరావు, విశ్రాంత ఏఎస్పీ సాయిన సుశీలరావు, ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, హితమ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎన్.హేమంతరెడ్డి, విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర అదనపు చార్జీలపై సీఎం నిర్ణయం హర్షణీయం

కోనేరుసెంటర్: హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు అయ్యే అదనపు ఖర్చులను ప్రభుత్వమే భరించేలా ముఖ్యమంత్రి రాష్ట్ర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్‌సిలార్‌దాదా అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు తెలంగాణ ప్రభుత్వంతో పోలిస్తే రూ.80 వేలు అదనంగా ఖర్చు అవుతుందన్నారు. ఈ ఖర్చును ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకోవటం పట్ల రాష్ట్రంలోని ముస్లింలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయన్నారు. దీనిపై ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 2,260 మంది ముస్లింలు హజ్‌యాత్రకు వెళ్లేందుకు సిద్ధమయ్యారన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హజ్‌కు వెళ్లే విమానాలకు టెండర్ దక్కించుకున్న సంస్థ విమానాల టిక్కెట్ ధరను పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అచ్చేబా చెప్పారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా ప్రారంభం

లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు వేగవంతంగా కల్పిస్తున్నట్లు లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. లక్ష్మీపురం జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాను సర్పంచ్ కోటేశ్వరరావు బుధవారం సాయంత్రం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.33 లక్షల 25 వేలతో కాలనీలో రెండు త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్, 15 కిలోమీటర్ల కండక్టర్, 90 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తద్వారా 160 గృహాలకు విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఎల్‌ఈడీ లైట్లను సర్పంచ్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్‌మెన్ పెద్దిరాజులు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ బట్టు అనిత, ఎనర్జీ అసిస్టెంట్ మేడేపల్లి సుబ్బారావు, నాంచారయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని 40వ డివిజన్ కాసానిగుడెంలో ఇటీవల మృతి చెందిన బొప్పన సుజాత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలను ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నాగరాజు బుధవారం అందజేశారు. మృతురాలు సుజాత నామినీ నవీన్‌కు నగదును అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు తరకటూరి సీతారాం, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మహా కుంభాభిషేకానికి భారీగా ఏర్పాట్లు



యాగశాలలో పూజలు చేస్తున్న రుత్వికులు, అష్టాక్షరీ స్వామిజీ



తుది మెరుగులు దిద్దుకుంటున్న అష్టభుజ మండపం

కోడూరు: ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో ఈ నెల 12న నిర్వహించే మహాకుంభాభిషేక మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవానికి సంబంధించి ఆలయ ప్రాంగణం, గ్రామంలో జరుగుతున్న పనులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ బుధవారం పరిశీలించారు. 12న తెల్లవారు జామున 4 గంటలకు మహాకుంభాభిషేక ఉత్సవం ప్రారంభమైనేదచం 11 గంటల వరకు సాగుతుందని అష్టాక్షరీ స్వామిజీ తెలిపారు. యాగశాల నుంచి కలశాలను ఊరేగించి శ్రీమన్నారాయణుడి 11అడుగుల మూలమూర్తికి, గర్భాలయంపై ఉన్న కలశాలకు అభిషేకాలను నిర్వహిస్తామన్నారు. 10 ఎకరాల్లో లక్ష మందికి అన్నసమారాధన అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఏవిధమైన సౌకర్యాలు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బూరగడ్డ హరినాథ్ బాబు, మద్దాలి ప్రసాద్, జూపూడి సుభాష్‌చంద్రబోస్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. అవనిగడ్డ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉత్సవాలకు లక్ష మంది భక్తులు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు. వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఉత్సవాల్లో భాగంగా యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. అష్టాక్షరీ మంత్రజపం, చతుస్థానార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం దేవేరులను ప్రత్యేక పల్లకీలో ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

రేపు మండప ప్రారంభోత్సవం

అష్టభుజ ఏకాదశి మండపం నిర్మాణ పూర్తి అయి ప్రారంభానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైయింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మండప నిర్మాణ శైలిని రూపొందించారు. మండపం లోపల ఏటూ చూసినా ఎనిమిది భుజాలు ఉండేలా నిర్మాణం చేశారు. రూ.1.10కోట్ల వ్యయంతో ఈ మండప నిర్మాణ పనులు జరిగాయి. మండపంపైన విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అమ్మవార్ల విగ్రహాలను చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. ప్రధాన ద్వారానికి ఇరువైపులా జయ, విజయలు విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) పర్వదినం నాడు శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో రాష్ట్ర గోదా విష్ణు సహస్ర నామ పరివార్ ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన 60 భక్తబృందాల సభ్యులు తరలివస్తారు. 10 ఏళ్లుగా ఈ పారాయణం జరుగుతుండగా, ప్రస్తుతం ఈ భక్తబృందాల సభ్యుల చొరవతో ఈ మండపాన్ని నిర్మించారు. ఇప్పటికే ఉల్లిపాలెంలో శ్రీమన్నారాయణ స్వామి, నమ్మాళ్వార్, గరుత్మంతుడు, రామానుజాచార్యుల ఆలయాలు ఉండగా, ప్రస్తుతం ఈ ఆలయాల పక్కనే ఈ మండపాన్ని కూడా నిర్మించడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో ఉట్టిపడుతుంది. శుక్రవారం ఉదయం 9గంటలకు అష్టభుజ మండపాన్ని ప్రారంభిస్తారు. నల్లగొండ, కర్నూలు, నకిరేకల్లు, విజయవాడ ప్రాంతాలకు చెందిన భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసువర్చలాంజనేయస్వామి వారి ఆలయంలో గురువారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు జరుగుతాయన్నారు. గురు, శుక్ర వారాల్లో ఉదయం పురాణ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తిచే సుందరాకాండ పారాయణ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం సుందరాకాండ హోమాలు పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, కీర్తిప్రధన్ శిష్య బృందం వేద మంత్రాలతో ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 13న అష్టోత్తర కలశస్నపన, 14వ తేదీన ఉదయం భక్త బృందం ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణ, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రికి పుష్పయాగం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 30వ తేదీ శ్రీరామనవమి నుంచి ప్రారంభమై గత 45 రోజులుగా జరుగుతున్న హనుమాన్‌చాలీసా పారాయణ ముగింపు కార్యక్రమం ఉంటుందని వారు చెప్పారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

నేడు బైక్ ర్యాలీ

హనుమజ్జయంతి సందర్భంగా గురువారం కాషాయ ధ్వజాలతో మండలంలో హనుమాన్ శోభాయాత్ర బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శోభాయాత్ర కమిటీ సభ్యులు తెలిపారు. పాశ్చాపురం గ్రామం నుంచి బంటుమిల్లి, పెదతుమ్మిడి, సాతులూరు, అర్తమూరు, చినపాండ్రాక గ్రామల మీదుగా ర్యాలీగా ఆలయం వద్దకు చేరుతుందన్నారు. భక్తులు ఈ ర్యాలీలో పాల్గొని గ్రామాల్లో ఘనస్వాగతం పలికి విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయుని గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

భావదేవరపల్లి(నాగాయలంక): హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త మలిశెట్టి సాంబశివరావు(నామాలు) పర్యవేక్షణలో నాంచారయ్య నేతృత్వంలో ఉత్సవం ఆరంభం సందర్భంగా ఆకుపూజ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భజన బృందం నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. మలిశెట్టి బాలాంజనేయులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవ పూజలు జరుగుతాయన్నారు. 14న హనుమాన్ జయంతి రోజున మహా అన్నసంతర్పణతో ఉత్సవాలు ముగుస్తాయని సాంబశివరావు చెప్పారు.

ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు



పేరిశెట్టి పూర్ణిమ, 63వ ర్యాంక్



పూరిళ్ల కార్తిక్ దినేష్, 150వ ర్యాంక్

పెడన: ఎస్సీ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పెడన నియోజకవర్గం నుంచి ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. మంగళవారం విడుదలైన ఈ ఫలితాలలో గూడూరు మండలం కప్పలదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పేరిశెట్టి పూర్ణిమ వందకు 78.25 మార్కులు సాధించి 63వ ర్యాంకు సాధించింది. పదో తరగతిలో పూర్ణిమకు 585 మార్కులు వచ్చాయి. పెడన జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పూరిళ్ల కార్తిక్ దినేష్ 74 మార్కులు సాధించి 150వ ర్యాంకును కై వసం చేసుకున్నాడు. పదో తరగతిలో 552 మార్కులు సాధించాడు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

లంక గ్రామాలను కలుపుతూ 'బడి బస్' నడపాలని వినతి

మోపిదేవి: చల్లపల్లి నుంచి వెంకటాపురం, ఉత్తరచిరువోలులంక, మోపిదేవిలంక మీదుగా అవనిగడ్డకు రింగ్ రోడ్డులో విద్యార్థులు, రైతులకు అనుకూలంగా 'బడి బస్' నడపాలని ఆయా గ్రామస్తులు అవనిగడ్డ డిపో మేనేజర్ హనుమంతరావును కోరారు. ఈ మేరకు డీఎంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా ఈ రూట్‌లో ఆగిపోయిన బస్ సర్వీస్‌ను పునరుద్ధరించి తమ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ సమస్యను రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో చెన్నగిరి సత్యానారాయణ, మెరకనపల్లి నరేష్, తోట శ్రీనివాస్, సుధాని నందగోపాల్, రేపల్లె నాగేంద్ర బాబు, కోసూరు సీతారామాంజనేయులు, కమతం నరేష్, కూరేటి జగన్, పవన్, కూరేటి మనోజ్, కూరేటి రాఘవ పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అవనిగడ్డ: స్థానిక ఏపీ ఎస్‌ఆర్టీసీ డిపో కార్యాలయంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 11 నుంచి 12.30 గంటల వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 99592 25466 నంబర్‌కు కాల్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543, 79950 92116 (మచిలీపట్నం, పెడన)
99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com